కథానిక

# కేశవుడు

వి. నారాయణరావు

"నువ్వు ఆలోచించవద్దురా-" అని కేశవుడికి ఎన్నోసార్లు చెప్పాడు రఘు. "అసలు నీకు బాధలన్నీ పట్టిపనికిరాని ఆలోచనలవల్ల కలుగుతున్నాయి. నువ్వు ఆలోచించకురా"— అని మళ్ళా చెప్పాడు రఘు- కేశవుణ్ణి రైలెక్కిస్తూ.

* * *

కేశవుణ్ణి ఆ రైలు మద్రాసు పట్టుకొచ్చి పడేసింది. అతను ఆ మహానగరపు నల్లరోడ్ల అంచుల మీద ఒంటరిగా - తల వేలాడేసుకుని తిరిగాడు- ఆలోచించాడు. ఎండలో తిరిగి తిరిగి తారు రోడ్డులా నల్లబడిపోయాడు. ఆలోచించి ఆలోచించి సాయంకాలపు ఆకాశంలా ఎర్రబడిపోయాడు - ఆలోచించడం మానలేకపోయాడు.

ఎక్కడా అంతం కనిపించని రోడ్డు అంచులతోనూ - ఎప్పుడూ చల్లగా అనిపించని మండు టెండలోనూ స్నేహం చేసిచేసి కేశవుడు — ఉద్యోగం సంపాదించాడు. "అమ్మయ్య" అని సముద్రం ఎదురుగుండా నిలబడి నిశ్వాసం విడిచాడు.

ఆ శబ్దం ఎవ్వరికీ వినబడనియ్యకుండా సముద్రుడు మింగేశాడు...

రఘుకి ఎల్లా వినబడిందో తెలియదు-ఆ శబ్దం. ఆ ఊళ్ళో, ఏటిగట్టున-ఎప్పుడూ కేశవుడు తల పగిలిపోయేట్టు ఆలోచించే ఆ చోట ఆకాశపు అంచుకు ఎదురుగుండా నిలబడి మరుగుతున్న ఏటినురగలోకి చూస్తూ "అమ్మయ్య" అన్నాడు. 'ఇక నేనా కేశవుడు ఆలోచించకుండా ఉంటాడు. ఇకనుంచేనా సుఖపడతాడు' అనుకుని.

అతను పొరపాటుపడ్డాడు. కేశవుడు ఆలోచనలు మానలేదు. అనేకలక్షల మద్రాసు నగరాలను మింగేయగల మహాసముద్రం ఒడ్డున-ఒంటరిగా తలవంచుకుని కూచుంటాడు కేశవుడు. ఇసుకలో రేణువులన్ని ఆలోచనలు సముద్రంలో తరంగాలతో పోటీ పడుతూంటాయి. సముద్రుడు ఎంత గొప్పవాడు! ఎన్ని ఎన్నెన్ని-ఎందరెందరి- ఆలోచనలు మింగగలడు!

పరీక్షల ఫలితాలు వచ్చేసేరోజు దగ్గరకి వచ్చేస్తూండగా- కేశవుడి మనస్సుని కొత్త ఆలోచనలు కలవరపెడుతున్నాయి. అవి కొత్త ఆలోచనలు కావు-పాత సంగతుల కొత్త జ్ఞాపకాలు.

సముద్రం పక్కనుంచే రోడ్డుమీద నడుస్తాడు కేశవుడు. ఆలోచనలు అతని కాళ్లు అతన్ని ఎక్కడికి పట్టుకుపోతున్నాయో తెలియనియ్యవు. మధ్యలో ఎక్కడో జ్ఞాపకంవచ్చి, ఆఫీసుదాటి చాలా దూరంవచ్చేశాడని తెలిసి, గాభరాగా వెనక్కి నడుస్తాడు కేశవుడు.

"పరీక్షలు తెలిసిపోతాయి-ఈవేళ" కేశవుడు ఆలోచనలంత వేగంగా నడుస్తూ అనుకున్నాడు. దూరాన ఉన్న రఘుకన్నా ఒకరోజు ముందు తెలుస్తాయి తనకి! రఘు పరీక్ష ఏమవుతుందో! పరీక్షలసంగతి జ్ఞాపకంవస్తే ఒకపెద్దకథ అతని కళ్ళముందు జరిగిపోతుంది.

* * *

ఆవేళ రఘూ, తనూ పక్కపక్కనే, ఒక్క బెంచీమీదే కూచున్నారు. రఘు అడిగాడు. ఈ Annotation ఎందులోదిరా అని. తనకి తెలియకపోతే చెప్పకపోయినా బాగుండును. చెప్పాడు. అదీ తప్పు. బయటికొచ్చాక తెలిసింది- రఘు మొదట రాసిందే రైటు. తను చెప్పింది రైటని భ్రమపడి వాడు రాసింది కొట్టేసి-తను చెప్పింది రాశాడు.

పాపం రఘు అంతకుముందు మూడు పేపర్లూ పాడుచేశాడు. బోటాబోటిగా వస్తాయిమార్కులు. ఎంతో గాభరాపడిపోయాడు. అంతకన్నా కంగారుపడిపోయాడు తను. ఆ 'సందర్భం' తప్పు రాసినందుకు నాలుగు మార్కులు పోతాయి. సరిగ్గా అంచుమీదఉన్నవాడికి నాల్గు మార్కులు పోవడం సామాన్యమా, తనవల్లే యీ పనంతా అయింది. రఘుపరీక్ష పోతుందేమో. నాలుగు

మార్కుల్లోనే పోతుంది. అందుకు తనే కారణం. లేకపోతే రఘు హాయిగా పాసయ్యేవాడు. పాపిష్టి నోరు. రఘు రాసిందే రైటు. అనాలోచితంగా ఆ మాట అన్నాడు. ఆవేడిలో రఘు ఆలోచించ లేదు. తనుచెప్పింది రైటనుకున్నాడు.

కేశవుడి మొహం కందిపోయింది. రఘు పరీక్ష తన చేతులారా పోగొట్టేశానని ఎంతో యిదయి పోయాడు. రఘు జీవితాన్ని నాశనం చేసినవాడిలా మథనపడిపోయాడు. మాట్లాడడు. చదవడు.

రఘు ఇంత గాభరా పడడు — కేశవుడిని పడనియ్యడు.

"ప్రతి చిన్న దాన్ని గురించీ మెదడు గుల్ల చేసుకోకురా. నీకు ఈ ఆలోచనలే లేనిపోని బాధలన్నీ తెచ్చిపెడుతున్నాయి" అంటాడు రఘు.

"నీకెవడు చెప్పాడురా— నా పరీక్ష పోతుందని? అయినా సరిగ్గా నాలుగు మార్కుల్లోనే పోతుందని ఏమిట్రా. నువ్వు తప్పు చెప్పినందువల్లే ఇదంతా అయిపోబోతోందని అంత తల్లకిందులై పోతావేమిటిరా. చిన్నపిల్లాడిలాగాను, నువ్వు తోచిందేదో చెప్పావు. అది తప్పోరైటో చూసుకునే జ్ఞానం నాకుండాలా వద్దా? శుభ్రంగా చదివి ఉంటే నాకే జ్ఞాపకం ఉండేదిగా. నేను శ్రద్ధగా చదవక పోవడంవల్ల —వస్తే గిస్తే— ఏదైనా నష్టం రావాలి గాని, అంతటికీ నువ్వు కారణం అని బాధపడతా వేమిటిరా? అసలు నువ్వు ఇవేవీ ఆలోచించకురా బాబూ!" అని మొత్తుకున్నాడు రఘు.

* * *

కేశవుడికి ఇవేవీ బుర్రకెక్కవు. అతనికి ఒక్కటే తెలుసు. రఘు పరీక్షకి ఏ ప్రమాదమేనా జరిగితే అందుకు తనే కారణం. రఘు పరీక్ష ప్యాసయి పోతే ఎంతబాగుండును!

ఆవేళ ఉదయం-సముద్రపురోడ్డు అంచుమీద పేపరులో చూస్తూ కంగారుగా వెతుకుతూన్న కేశవుడి కళ్లు ఒక్కసారిగా చీకట్లు కమ్మాయి.

రఘు నంబరు కనిపించలేదు.

దాని పక్కనే తన నెంబరు పడి ఉందని కొంచెం సేపోయాక చూచుకున్న మెదడు ఇంకా కలవరపడి, కొయ్యబారిపోయింది. సముద్రపు ఇసుక మీద సజీవశవంలా ఉన్నాడు కేశవుడు. నాలుగు వందలమైళ్ళ అవతల ఉన్న రఘు కాళ్ళదగ్గర ఉన్నాడు కేశవుడు. రఘు మాట్లాడకుండా నిలబడి చూస్తున్నాడు. కేశవుడి మొహంలో నెత్తురు లేదు. కళ్ళల్లో నీళ్ళు లేవు. కంఠంలో మాటలు లేవు. రఘు తనని క్షమించడు—క్షమించకూడదు. తన తలని ఎవరేనా కత్తితో తీసేస్తే బాగుణ్ణు!

పేపరు గాలికి ఎగిరిపోయింది. కేశవుడు ప్రపంచంలోకి వచ్చాడు. ఆలోచనలు ఆగి— అతన్ని రోడ్డుమీదికి నడిపించాయి. అతను ఎంత దూరం నడిచాడో తెలియదు. అతనిలో పరీక్ష పాసయినవాడి ఉత్సాహం లేదు. పట్టభద్రుడైన వాడి సంతోషం లేదు. ఏదో దారుణమయిన హత్యానేరం చేసినవాడిలా నడుస్తున్నాడు. జనంలో పడవగంట తొందర ఎక్కువై పోతోంది. ఆఫీసులు మనుషులకోసం నోళ్ళు తెరుచుకొని ఎదురుచూస్తున్నాయి. మనుషులు తుపానుగాలికి కొట్టుకుపోతున్న ఎంగిలాకుల్లా ఆ మహా పదను గహ్వరాలలోకి దూరిపోతున్నారు. కేశవుడికి ఆఫీసు ఉందన్న స్మృతిలేదు, అతను అసంగతంగా బరువుగా నడుస్తున్నాడు. రఘునిగురించి ఆలోచించ లేదు. ఆలోచించటంగా ఉండటంలేదు.

రోడ్డుమీద చాలా సమ్మర్దం ఉన్న చోటికి వచ్చాడు. ఆలోచనలు ప్రమాదకరమైన చోటికి వచ్చాడు. చాలకాలంగా నిలబడి—రోడ్డు దాటాలనుకుంటున్నాడు. దూరంనుంచి వస్తున్నారు— ఇద్దరు పిల్లలు. చిన్నపిల్లలు. భుజానికి పుస్తకాల సంచులూ వాళ్లూ—చేతిలో ఒక అట్ట. దానికో క్లిప్పు - పెన్సిలూ - అవి చూచి కేశవుడు నవ్వుకున్నాడు. వీళ్లూ పరీక్షలకి వెళ్ళుతున్నారు. ఏ బాధలూ ఎరగని బంగారపుబొమ్మలు. వాళ్లిద్దరూ అన్నదమ్ములేమో. చిన్నవాడి చేతిలో చిన్న టిఫిన్ కారియరు. పాపం! అదీ మొయ్యలేక పోతున్నాడు. గబగబా నడుచుకుంటూ వచ్చేస్తున్నారు. అందులో ఒక గడిగాడు.

"మణి ఎన్న?"

అరవం తనకి అర్థం అవుతోంది ఇప్పుడిప్పుడే— టైమెంత? అని అడుగుతున్నారని తెలిసికొని, గడియారం చూచాడు. 9-45 అయింది.

పత్తు (పది) అన్నాడు గబుక్కున. అరవంలో తనకి కొద్దిమాటలే వచ్చు. పావుతక్కువ పది అని చెప్పడానికి ఏమనాలో తెలియదు.

వాళ్ళిద్దరూ గాభరాగా పరిగెత్తడం ప్రారంభించారు. టిఫిన్ కారియరు మోకాళ్ళకి కొట్టుకుంటోంది. అందులో పెద్దవాడు, "టైమైపోతోందిరా-మేష్టారు కొడతారు" అని గాబోలు అంటున్నాడు. వాళ్ళు గబగబా రోడ్డుకిఅడ్డంపడ్డారు.

కేశవుడికి కంగారుపుట్టింది. వాళ్లు పరుగెత్తేస్తున్నారేమిటి-వాళ్ళబడి పది గంటలకే నేమో. తను పది అని చెప్పబట్టి వాళ్ళలా పరిగెడుతున్నారేమో. ఇంకా 15 నిముషాలు టైముంది. ఎల్లా వాళ్ళకి చెప్పడం? గట్టిగా అరిచాడు వాళ్ళని వెనక్కి రమ్మని. వాళ్ళు వెనక్కి చూడలేదు. వాళ్ళతొందరవాళ్ళది. ఆ గోలలో అతని గొంతుక వినబడలేదు. కేశవుడు వాళ్ళ వెంబడే గబగబా పరుగెత్తాడు నాలుగడుగులు. వాళ్ళు చాలా కంగారుగా రోడ్డు దాటేస్తున్నారు-రోడ్డుమీద రాక్షసులు నడిపే యంత్రాలు పరిగెడతాయని తెలియని దేవతలు-బయ్యిమని అరిచింది కారు హారను కంగారుగా అటు పరిగెత్తాడు కుర్రాడు. బాణంలా అటునుంచి దూసుకొచ్చిందిమరో కారు. "కస్" మని బ్రేకులు వేశాడు డ్రైవరు. "అన్నయ్యా" అని కేకపెట్టాడు పసివాడు. పిచ్చివాడిలా పరిగెట్టాడు కేశవుడు.

అంతా క్షణంలో అయిపోయింది. గడ్డకట్టుకుపోయిన నెత్తురుముద్ద- కేశవుడి కడుపులో చెయ్యిపెట్టి కెలికేసింది. వికారంగా-భయంకరంగా ఉన్న ఆ ముద్దని చూడలేక కేశవుడు వంకరలు తిరిగిపోయాడు. నరనరం జ్వలించిపోయింది బాధతో, ఆవేదన, భయం, బాధ, ముఖాన్ని ముడతలు పెట్టేశాయి - కూలబడిపోయాడు-కాళ్ళమీద కేశవుడు.

"ఎవరు-మీ అబ్బాయా అండి" అన్న పోలీసు మాటకి వెర్రిగాచూశాడు కేశవుడు. కాదని అతనికి తెలిసి కాబోలు అతను వెళ్ళిపోయాడు. చుట్టూ ఏంజరుగుతోందో కేశవుడికి తెలియదు.

క్షణం క్రితం-ఏమీ ఎరగనట్టు నడిచివస్తున్న జంటలో-ఇప్పుడు ఒకడు లేడు. అందుకు కారణం, ఆ కారు, డ్రైవరు, ఆ కుర్రాడు అడ్డంగా పరిగెట్టడం అంటారు. అంతా కేశవుడికి నిజకారణం తెలుసు. తనెందుకు టైము తప్పుచెప్పాడు? పాపం-దురదృష్టవంతులు. అడక్క అడక్క తననే అడిగారు టైము. పాపిష్టినోరు. వచ్చీరాని అరవంలో ఎవడు చెప్పమన్నాడు. పోనీ అదేనా ఎలాగో కూడబలుక్కుని 9-45 అని చెప్పరాదా?

పాలబుగ్గల పసిపిల్లలు - పరీక్షలకి టైముకి పోవాలనే ఆదుర్దాతో ఉన్న పిల్లలు. చేతులారా చంపేశాడు అందులో ఒకడిని. ఇందుకు అసలు కారణమయిన తనని ఎవ్వరూ ఏమీ అనరు. అది మరింత బాధ. తనని ఉరి తీసేసినా బాగుండును.

కొయ్యబారిపోయి రూముకి వచ్చాడు కేశవుడు. "నేనే చంపాను-బంగారపు పాపణ్ణి. నేనే-చేతులారా చంపాను" అని అంటున్న అతన్ని చూచి, సలసల కాగిపోతున్న అతని వంటిని చూచి, చింతనిప్పుల్లాంటి అతని కళ్ళని చూచి, రూములో వాళ్ళు హడలిపోయారు.

* * *

నాలుగువందలమైళ్ళ అవతల ఉన్న రఘు నిద్రలో ఉలిక్కిపడ్డాడు. కడుపులో ఏదో కెలికేసినట్టు కలవరపడ్డాడు. భయంకరంగా జీబుమంటున్న చీకటిలోకి చూశాడు - ఏమున్నా ఉండేమోనన్నట్టు. లేచి-మలిపోయిన నాడిలా-కేశవుడు కూచునేచోటికి ఏటిఒడ్డుదగ్గిరకి వెళ్లాడు. చీకట్లో చీకటిలాగా-సుళ్ళు తిరుగుతూన్న ఏటి నడి ఎక్కడినుంచో సలసలమనే వేడిని తెచ్చి పోసింది రఘు వంటిమీద ఎక్కడో ఎవరి మనస్సులోనో జరిగిన భూకంపానికి రఘు కంపించిపోయాడు-వెంటనే రైలెక్కాడు.

* * *

కేశవుడిచుట్టూ మనుషులున్నారు. కేశవుడు పిచ్చిగా కలవరిస్తున్నాడు.

"రఘూ-పరీక్షపోయింది. కుర్రాడి ప్రాణం పోయింది."

"రఘు ప్రాణంపోయింది. కుర్రాడి పరీక్ష పోయింది నేను మిగిలాను-నేనే."

సుడిగాలిలా లోపలికివచ్చాడు రఘు. కేశవా అని అరుస్తూ. "నాతండ్రీ-నువ్వా ఆలోచనవల్ల ఇంతపని చేసుకున్నావురా-ఆలోచించ వద్దురా అని ఎంత మొత్తుకున్నా వినవుకదా." చెయ్యి కేశవుడి నుదిటిమీదవేసి వెర్రిగా చూస్తున్న కేశవుడి కళ్ళల్లోకి చూస్తున్నాడు రఘు——

అతని కళ్ళల్లోంచి గుండెకరిగి కారిపోతోంది.